
"అమ్మాయ్ అరుణా! గుడికని వెళ్ళిన మీ మామగారు ఇంకా రాలేదు. నాకివాళ కొంచెం అలసటగా వుంది. త్వరగా నిద్ర వస్తోంది. ఆయనొస్తే రెండు పుల్కాలు చేసి పెడతావా? నేను వెళ్లి పడుకుంటాను"

వేడుకోలుగా అడుగుతున్న అత్తగారి మాటలకు టీవీ ధ్యాసలో వున్న ఆమె అందుకు బదులుగా చిరునవ్వు నవ్వింది.



# ఆసరా

-ఎ.రాజరాజేశ్వరి

ఆ నవ్వు ఇచ్చిన భరోసాతో సుమతి వెళ్లి నిద్రపోయింది.


ఆనందరావు ఇంటికి చేరుకునేసరికి తొమ్మిదిన్నర దాటింది. తన స్నేహితుడితో కలసి బాబా గుడికి వెళ్లాడు. భజనలు, హారతి అయి బయలుదేరుతుంటే ఎవరో తెలిసున్న వాళ్లు కనిపించి పలకరించడంతో వారితో కబుర్లలో పడడంతో టైమే తెలియలేదు.

ఆనందరావు సాయంత్రాలు ఏమీ తోచక పార్కుకో, గుడికో తన స్నేహితుల దగ్గరతో వెళ్లి తిరిగి డిన్నర్ టైమ్‌కి ఇంటికి రావడం అలవాటు. అతడు వచ్చాక కొడుకు, కోడలు, మనవలు భోజనాలు చేసినా తనకీ, భర్తకీ రాత్రిళ్లు పుల్కాలు చేస్తుంది సుమతి. మితాహారం తీసుకోవడం వారికి అలవాటు అయిపోయింది. అతడు బయటకి వెళుతుంటే సుమతి మరీ మరీ చెప్పింది "కాస్త త్వరగా రండి. ఊరగాయకని మామిడికాయలు తరిగిపోసాను. అలసట ఎక్కువయింది. త్వరగా పడుకోవాలి" అంది. కబుర్ల ధ్యాసలో తను ఆ సంగతే మరచిపోయాడు.



## స్నేహకే తెలియాలి

స్నేహ తమిళనాడులోని తిరువన్నామలైలోని శివాలయంలో ఇటీవల ప్రదక్షిణాలు చేసిందిట. మరి ఎన్నిసార్లు తిరిగిందో గానీ రాత్రి 12 గంటలకు గుడికెళ్లి తెల్లవారు ఝామున 4 వరకూ అలా ప్రదక్షిణలు చేస్తూనే వుందిట. పగలైతే జనం బాగా వుంటారని ఇలా రాత్రి పూట ప్రదక్షిణలు చేసిందిట. రజనీకాంత్ లాంటి వాళ్లు సైతం ఇక్కడి శివుడిని ఎంతో భక్తితో కొలిచి తమ కోరికలను నిజం చేసుకుంటారని చెన్నయ్ సినీజనాలు చెప్పుకుంటారు. మరి స్నేహ ఎందుకని ప్రదక్షిణాలు చేసిందో ఆమెకే తెలియాలి మరి!




స్నానం పూర్తి చేసుకుని డైనింగ్ టేబుల్‌మీద గిన్నెలుంటే మూతలు తీసి చూసాడు. గుప్పెడు అన్నం, కొంచెం కూర, గిన్నె అడుక్కి చేరిన రసం కనిపించాయి. కోడలు కోసం కిచెన్‌లోకి తొంగి చూసాడు. అప్పటికే ఆమె పూర్తి చేసుకుని నైటీలోకి జారిపోయింది. దానర్థం కిచెన్ వర్క్ క్లోజయిపోయిందని.

తన గదిలోకి వెళ్లబోతున్న అరుణ డైనింగ్ టేబుల్ దగ్గర నిలబడ్డ మామగారిని చూసి క్షణంపాటు ఖంగుతింది. అంతలోనే తేరుకుని "అత్తయ్య త్వరగా పడుకున్నారు. మీరు వస్తారని ఇప్పటివరకు చూసాను. మా భోజనాలు కూడా అయిపోయాయి. ఇక పడుకోవడానికి వెళుతున్నాను. కొంచెం పెరుగన్నం తిని ఫ్రిజ్‌లో పళ్లున్నాయి వాటితో ఇవ్వాల్టికి అడ్జస్టు చేసుకోండి" అని ఆయన జవాబుకోసం కూడా చూడక తన గదిలోకి వెళ్లిపోయింది.

కోడలి ప్రవర్తనకి ఆనందరావు నివ్వెరపోయాడు. ఎప్పుడో మధ్యాహ్నం తిన్న భోజనం, గుడిలో పిడికెడు ప్రసాదం తిన్నా అది నడిచి రావడంతో అరిగిపోయింది.

చిరుతిళ్లు తినే అలవాటు లేకపోవడంవల్ల అతడికి చాలా ఆకలిగా ఉంది. ఆమె తండ్రి ఒకసారి రాత్రి పదిన్నరకి వస్తే అతడు వద్దంటున్నా వినకుండా టిఫిన్ చేసి బలవంతాన తినిపించింది. తను ఆమె తండ్రిలాటివాడు కాదా? కోడలిని తన స్వంత కూతురిలా చూసుకుంటున్నా ఆమెలో ఎందుకీ వ్యత్యాసం?

తన తిండి గురించి పట్టించుకోక త్వరగా నిద్రపోయిన భార్య మీద, తనని లెక్క చేయని కోడలిమీద, ఆమెను మందలించని కొడుకు మీద ఏకకాలంలో కోపం వచ్చి అతడి ఆకలి చచ్చిపోయింది. అడుగున మిగిలిన పదార్థాలను తినబుద్ధి కాక మంచినీళ్లు తాగి పడుకున్నాడు.

***

మర్నాడు ఆకలి, నిద్రలేమివలన వాడిపోయివున్న భర్త మొహం చూసి సుమతిలో అనుమానం తలెత్తింది.

"కోడలితో చెప్పాను మీకు పుల్కాలు చేయమని తిన్నారా?" అంది.

అతడు జవాబివ్వక మౌనం వహించడంతో జరిగింది అర్థమయి ఆమెలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఇంటి యజమాని అయి ఉండి తిండి లేక నీరసపడిన భర్తని చూసి కోపం, అసహనం వచ్చి "అరుణా! ఒకసారి ఇటురా" అంటూ బిగ్గరగా పిలిచింది.

ఆనందరావు కంగారుపడ్డాడు. అసలే ఆమెకు బిపి. కోపంతో కోడలితో గొడవ పడి ఆరోగ్యం పాడు చేసుకుంటే తనకే నష్టం. ఆమెను నివారించాడు.

"పోనీలే సుమతీ! ఇంత చిన్న విషయానికి ఆ అమ్మాయిని నిలదీస్తే నొచ్చుకుంటుంది. ఆలస్యంగా రావడం నాదే తప్పు. వదిలేయ్ ఇంక" అన్నాడు ఆమెను శాంతపరుస్తూ.

అప్పటికే బిపి పెరిగిన ఆమె భర్త మాటలు ఖాతరు చేయక "అరుణా" అంటూ మళ్లీ పిలిచింది.

అత్తగారి గొంతులోని తీవ్రతకి కాస్త జంకిన అరుణ తనకి సాయం రమ్మంటూ భర్తను రిక్వెస్ట్ చేసింది.

"నువ్వు ముందువెళ్లి సంగతి కనుక్కో. నేను తరువాత వస్తాను" అన్నాడు బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ.

"ఏమిటో చెప్పండి. పిల్లలకు టైమవుతోంది. స్కూలుకి రెడీ చేయాలి" అంది నేలచూపులు చూస్తూ.

"మీ మామగారికి పుల్కాలు చేసి పెట్టమని చెప్పి పడుకుంటే నువ్వు

చేసిందేమిటి? ఆయనను వస్తు పడుకోపెడతావా? ఇంటి యజమాని, నీకు మామగారు. ఒక్క పూట ఆయనకి రెండు రొట్టెలు చేసి పెట్టలేవా?'' తీవ్ర స్వరంతో నిలదీస్తున్న ఆవిడ మాటలకు అరుణ మొహం వివర్ణమయింది.

"ఏం చేయమంటారు? ఆయన త్వరగా వస్తే చేసి పెట్టేదాన్ని. మా అందరి భోజనాలు అయిపోయినా కూడా ఆయన రాలేదు. నేను వెళ్లి పడుకోవాలనుకుంటుంటే వచ్చారు. ఇంట్లో ఏమీ లేకపోతే నన్ను తిట్టండి. కాస్త అన్నం వుంది, పళ్లున్నాయి. అవి తినమనే చెప్పాను. ఒక్క పూటకి కాస్త సర్దుకోవచ్చుకదా. ఏదో తప్పు చేసినట్లు నిలదీస్తారేమిటి?'' అంది.

ఏమాత్రం పశ్చాత్తాపడక తిరిగి కౌంటర్ అటాక్ ఇస్తున్న కోడలివైపు అసహనంతో చూసింది సుమతి.

"నీకు కష్టం లేకుండా రోజూ పనంతా చేస్తున్నాను. ఒక్క పూట ఇంటి పెద్దకి తిండి పెట్టక వస్తు పడుకోబెట్టడం ఏమయినా బాగుందా? నమ్మినందుకు తగిన శాస్తి చేసావు''

అత్తగారి ఆరోపణకి తన దగ్గర జవాబు లేక నీళ్లు నమిలింది. ఆవిడ అన్న మాటలో నిజం ఉన్నా మాట పడాలన్న పౌరుషం ఆమెలో విచక్షణను పోగొట్టింది.

"ఇందాకటి నుంచీ చూస్తున్నాను. రిటైరైన మనిషిని పట్టుకుని ఇంటి యజమాని అంటారు. సంపాదించే మనిషి మా ఆయన యజమాని అవుతారు. ఆయన భార్యగా నేను ఈ ఇంటి యజమానురాలిని.''

పెడసరంగా అంటున్న అరుణ మాటలకు సుమతితోపాటు ఆనందరావు మనస్సు కూడా చివుక్కుమంది. కోడలి మాటలకు సుమతి సహనాన్ని పూర్తిగా కోల్పోయింది.

"సంపాదించే మీరు ఈ ఇంటి యజమానులైతే మీ కుటుంబం కోసం ఇంత చేస్తున్నాం. మేమెవరమో, మా స్థానం ఏమిటో చెప్పి కదులు'' అని గద్దించింది.

అత్తాకోడళ్ల సంవాదం శృతి మించుతుంటే అప్పుడు లేచి వచ్చాడు సురేష్. ఎవరిని సపోర్టు చేయాలా అని క్షణం ఆలోచించాడు. తల్లికి వత్తాసు పలికి ఉద్యోగంచేసే భార్యని మందలిస్తే మళ్లీ ఆమెను ప్రసన్నం చేసుకోవడం అంత తేలిక కాదు. తల్లిమీద విసుక్కున్నా తల్లి మనసు కాబట్టి తనను త్వరగానే క్షమిస్తుంది.

"ఏంటమ్మా! పొద్దునే ఈ గొడవ? కోడలంటే కూతురులా చూసుకోవాలంటావు. ఇదేనా చూసుకోడం? అరుణ కూడా కూర్చుని తినడంలేదుకదా. ఆఫీసులో గొడ్డుచాకిరీ చేసి అలసిపోయి వస్తోంది. దాని బాధలేవో దానికుంటాయి. ఏదో ఒక్కరోజు నాన్నకు రోటీలు చేసి పెట్టలేదని ఇంత రాద్ధాంతమా? ఆయనసలు ఏదో ఒకటి తిని సర్దుకోవచ్చుకదా. అదే కావాలంటే ఎలా? ఆయనకన్నా నా కొడుకే నయం. దేనికీ పేచీలు పెట్టడు. అయినా ఆఫీసులో అంత పని చేసి వచ్చినా అరుణ ఏ లోటూ లేకుండా చూసుకుంటోంది. ఇంట్లో ఖాళీగా ఉంటావు. నాన్నకి ఏం కావాలో కాస్త చూసుకోవచ్చుగా''

కొడుకు మాటలకు ఆ దంపతుల మొహాలు మాడిపోయాయి.


"ప్రతి చిన్న విషయానికి మాతో ఇలా గొడవలు పడితే కష్టం. మీరు మంచిగా ఉంటే ఈ వయసులో మా ఆసరా మీకు దొరికి రోజులు ప్రశాంతంగా వెళతాయి. లేదంటే మీ ఇష్టం''

కోడలి ప్రవర్తనకన్నా కొడుకు మాటలు కొరడాతో ఛెళ్లున కొట్టినట్టయి ఆనందరావు వరండాలోకి చేరితే సుమతి కిచెన్‌లోకి వెళ్లిపోయింది. తలచుకున్నకొద్దీ కొడుకు మాటలు జీర్ణించుకోలేకపోతున్నాడు. వాళ్లు తమకి ఆసరా ఇస్తున్నారా? అప్రయత్నంగా అతడి పెదవులమీద చిరునవ్వు తొంగి చూసింది.

ఆనందరావు గవర్నమెంటు ఆఫీసులో ఆఫీసరుగా పని చేసి రిటైరయ్యాడు. పెన్షన్ పన్నెండువేలు కాక తన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ ఫిక్స్‌డ్‌లో వేయడంవల్ల దానిమీద వడ్డీ నెలకు పదివేలవరకూ వస్తుంది. రిటైరై ఆరేళ్లు దాటినా ఆర్థిక బాధలులేక జీవితం చాలా కంఫర్ట్‌గా ఉంది.

కొడుకు కోడలు ఇద్దరూ ఉద్యోగస్థులయినా వారికి డబ్బుకి ఎప్పుడూ కటకటే. హౌసింగ్ లోన్ తీసుకుని మంచి లొకాలిటీలో అపార్టుమెంటు కొనడంవలన వారి జీతాల్లో సింహ భాగం లోన్ కటింగ్‌కి పోతుంది. మిగిలిన జీతం జీవిత భీమా పాలసీలు, పిల్లల చదువులు, కాస్మెటిక్స్, విలాసాలు, వినోదాలకు ఖర్చయిపోతుంది.


వారు చెప్పకపోయినా పరిస్థితి గ్రహించుకున్న ఆనందరావు కుటుంబ బాధ్యతను తన చేతుల్లోకి తీసుకున్నాడు. పనిమనిషి, పాలు, కిరాణా, కూరలు, పళ్లు అన్నీ అతడు భరించడంతో ఇప్పటివరకూ జీవితం తనిస్తున్న ఆసరాతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా గడిచిపోతోంది.



## టైనీ సోలార్ బ్యాటరి

అమెరికాలో ఒక కంపెనీ సెరామిక్‌తో ఒక చిన్న సోలార్ బ్యాటరీని ఇటీవల తయారు చేసింది. 2011నాటికి మార్కెట్లోకి వచ్చే ఈ బ్యాటరీలో 20 కిలోవాట్ల హార్స్ శక్తి నిక్షిప్తమై ఒక ఇంట్లో 24 గంటలసేపు కరెంటుని సప్లయి చేస్తుందిట. దీని ఖరీదు 2000 డాలర్లు.

-తటవర్తి




వారికి తామిస్తున్న ఆసరా గుర్తించక వారేదో తమకి ఆసరాగా వున్నట్లు మాట్లాడడం అతడిలోని కోపం అవధులు దాటింది. తనకొచ్చే డబ్బులకి తనూ, భార్య ఎక్కడున్నా ఇంతకన్నా దర్జాగా, సుఖంగా ఉండగలరు. కనీసం తన భార్యకి అంతమందికి వండి వార్చే పని తప్పుతుంది.

దీర్ఘాలోచనలో వున్న అతడి దగ్గరకు సుమతి వచ్చి కూర్చుంది. ఆసరికే ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్లిపోవడంతో ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.


"పాపిష్టిదాన్ని కోపం ఆపుకోలేక ఏదో వాగి మిమ్మల్ని కూడా మాటలు పడేలా చేసాను. నన్ను క్షమించండి" అంది చెమరిస్తున్న కళ్లను ఒత్తు కుంటూ.

అతడు ఆమె తల నిమురుతూ "నీ తప్పేముంది పిచ్చిదానా? ఈ సంఘటనతో కొడుకు ప్రేమ, కోడలి మనసు రెండూ తెలుసుకోగలిగాము. మన బట్టలు సర్దు. కొన్నాళ్లు ఎటయినా తిరిగి మన జీవితాలు సుఖంగా, మనశ్శాంతిగా గడిచే మార్గం ఆలోచిద్దాం"



## లోబడ్జెట్టే శ్రేయస్కరం

సుస్మితాసేన్ ఓ చారిత్రాత్మక సబ్జెక్టుతో సొంతంగా సినిమా తీయాలని తెగ ప్రయత్నాలు చేసింది. అందులో తనే నటించడానికి కూడా నిర్ణయించుకుంది. కానీ అంత 'భారీ' బడ్జెట్‌ని ఖర్చు పెట్టడానికి తనకి కుదిరేపని కాదని తేలేసరికి ఇక ఆ ప్రాజెక్టుని విరమించుకుంది. అయితే ఎలాగైనా నిర్మాతగా మారాలనే కోరిక సుస్మితలో వుంది కనుక, ఓ చోటా బడ్జెట్ సినిమా అయినా తీయాలని ఉబలాటపడుతోందిట. ప్రస్తుతం ఓ లోబడ్జెట్ సినిమాని తీసే సన్నాహాల్లో వుందిట సుస్మిత.




"నాలుగురోజులు ఆగండి. ఊరగాయ కలిపాక వెళదాం. అయినా ఇంత సడెన్‌గా వెళ్లిపోతామంటే అంతా ఇబ్బంది పడతారు" అంది.

సుమతివైపు చిరాకుపడుతూ చూసాడు.

"మరేం ఫర్వాలేదు. కోడలు తెలివైంది. మన అండ లేకపోయినా సమర్థించుకు రాగలదు. అడ్డు చెప్పక. రేపే మన ప్రయాణం" అన్నాడు.

ఇక ఏం చెప్పినా అతడింక వినడనుకుని లేచి తమకి కావాల్సిన బట్టలు, వస్తువులు సర్దింది.

***

తల్లిదండ్రుల ఆకస్మిక ప్రయాణం గురించి విన్న అరుణ, సురేష్‌లు మొహమొహాలు చూసుకున్నారు.

"ఇంత సడెన్‌గా ఊరికెళ్తామంటే ఎలా? పిల్లలకు ఇబ్బంది. వాళ్ల సెలవుల్లో వెళ్దురుగానీ" అన్నాడు సురేష్.

తాము వెళ్లిపోతే తన పిల్లలకు ఇబ్బంది అంటున్నాడేగానీ తనని మిస్సవుతామన్న ఫీలింగ్ లేని కొడుకువైపు భావరహితంగా చూసాడు.

"మేము వెళ్లాలన్న నిర్ణయం జరిగిపోయింది" అన్నాడు ముక్తసరిగా.

అత్తగారు ఊరు వెళుతుందంటే అరుణ గుండెల్లో రాయిపడింది. ఏ మాటకదే చెప్పుకోవాలి. అంత పనీ ఆవిడే చూసుకోవడంలో అరుణకి ఏ కష్టం ఉండదు.

"త్వరగా వచ్చేయండి. ఊరగాయ కూడా కలపకుండా వెళ్లిపోతున్నారు" అని గొణుగుతూనే ఉంది.

***

పదిరోజులపాటు పుణ్యక్షేత్రాలు తిరిగాక "ఇక ఇంటికెళ్లిపోదామండీ. అబ్బాయి ఇప్పటికే త్వరగా రమ్మని నాలుగుసార్లు ఫోన్ చేసాడు. కోడలు కూడా త్వరగా రమ్మని చెబుతోంది" అంది సుమతి.

"ప్రయాణంలో ఉన్నాము కాబట్టి వాళ్లకి మన క్షేమం, ఉనికి తెలియజేసాం. ఇప్పుడు మా ఫ్రెండు గిరి ఉండేచోటుకు వెళ్తున్నాం. నా సెల్ సిమ్ కార్డు నెంబర్ మార్చేస్తాను. ఇకముందు వాళ్లు మనకి ఫోన్ చేసే అవకాశం ఉండదులే. ఎప్పుడైనా మనమే ఫోన్ చేద్దాం. ఇలా కొన్నాళ్లు దూరమున్నామంటే ఎవరి ఆసరా ఎవరికి అవసరమో ముందు ముందు తెలుస్తుంది వాళ్లకి" అన్నాడు.

ఆనందరావు స్నేహితుడు గిరి విజయవాడ జాతీయ రహదారి నుండి మూడు కిలోమీటర్ల లోపలికి వృద్ధాశ్రమం స్థాపించాడు. ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటుంది.

వారి వారి తాహతుకు తగ్గట్టు స్పెషల్ రూమ్స్, కామన్ రూములు, షేరింగ్ రూములు వాడుకోవచ్చు.

ఉదయాన్నే వ్యాహ్యాళి, యోగా, భజనలు ఉంటాయి. బలవర్ధకమైన పోషకాహారంతోపాటు జీవన సంధ్యలోకి వాలిపోయిన సమవయస్కుల కష్ట సుఖాలు, అనుభవాలు ఒకరికొకరు పంచుకుంటూ తమకున్న మానసిక, శారీరక రుగ్మతలు అన్నిటినీ మరచిపోయి చాలా ఉల్లాసంగా గడపసాగారు.

***

ఫస్టు తారీకు రావడంతో అరుణ, సురేష్‌ల పని కుడితిలో పడ్డ ఎలుకలా అయింది. ఖర్చుల ఊబిలో నుండి ఎలా బయటపడాలో అర్థం కాక గిలగిల్లాడసాగారు.

తాము కట్టాల్సిన ఫీజులు, బిల్లులు అన్నీ భయపెడుతూ నిద్ర లేకుండా

చేస్తున్నాయి.

తమకి సెల్‌ఫోన్లు ఉన్నా, కాలర్ ఐడి లేని ల్యాండు ఫోన్‌కి సుమతి ఫోన్ చేసి తమ యోగ క్షేమాలు కనుక్కొని పెట్టేస్తోంది. త్వరలో వస్తామన్న జవాబు తప్ప ఎక్కడి నుండి ఫోను చేసేది కూడా తెలియనివ్వడంలేదు.

తల్లిదండ్రి తామన్న మాటలకు అలిగి ఇల్లు వదిలి వెళ్లిపోయారన్న విషయం అప్పటికి గ్రహింపుకొచ్చింది. వారిపట్ల తమ అమానుష ప్రవర్తనకి సిగ్గుపడ్డాడు.

తమ ఆసరా లేకపోతే మీరు బ్రతకలేరని అవమానించారు. వారి ఎడబాటు తన కళ్లని పూర్తిగా తెరిపించింది. ఎవరి ఆసరా ఎవరికి అవసరమో జ్ఞానోదయం కలిగించింది.

అప్పటికే అరుణ ఇంటి పనితో, పిల్లల చాకిరీతో పూర్తిగా డీలా పడిపోయింది. అత్తగారు లేని లోటు ప్రతిక్షణం వెక్కిరిస్తుంటే ఆవిడ రాకకోసం ఎదురు చూసే స్థితికి చేరుకుంది. మామగారిపట్ల తన ప్రవర్తనకి సిగ్గుపడింది. 'ఛ... తనని తన బిడ్డలా ఆదరించే వారిపట్ల మనసు కష్టపెట్టింది. వారి ఉనికి తెలిస్తే క్షమించమని బ్రతిమాలి ఇంటికి తీసుకురావాలని ఆకాంక్షించసాగారు. వారి నెంబర్ ఎలా తెలుసుకోవాలోనని తీవ్రంగా ఆలోచించిన అరుణ నవ్వుతూ చెప్పింది.

"వారి నెంబర్ తెలియడం ఇష్టంలేక మన ల్యాండు ఫోన్‌కి చేస్తున్నారు. బజారుకెళ్లి కాలర్ ఐడి సౌకర్యం ఉన్న ఫోన్ తీసుకురండి. ఎల్లుండి మీ పుట్టినరోజు. మీకు తప్పక ఫోన్ చేస్తారు. ఆ నెంబర్‌ను బట్టి వారెక్కడున్నదీ తెలిసిపోతుంది."

భార్య తెలివికి, ఆమెలోని మార్పుకి సురేష్ సంతోషపడిపోతూ ఫోన్ తెచ్చి పెట్టాడు.

తన పుట్టినరోజునాడు తల్లిదండ్రులు తనకి శుభాకాంక్షలు చెప్పాక ఆ ఫోన్ నెంబర్ ఈజీగా ఐడెంటిఫై చేసాడు అది గిరి అంకుల్‌దని.

అమ్మానాన్నలు వృద్ధాశ్రమంలో వున్న సంగతి జీర్ణించుకోలేకపోయాడు. 'ఎలాగైనా వారి కాళ్లమీద పడయినా సరే ఇక్కడికి తీసుకువస్తాను. వారి మనస్సు నొప్పించక ఇకనైనా వారిని బాగా చూసుకో' అన్నాడు.

"మీరు ఒక్కరే వెళితే కుదరదు. నేను, పిల్లలు కూడా వస్తాం. అప్పుడే వారు పూర్తిగా కరుగుతారు. మనవల కోసమన్నా మన వెంట వస్తారు" అన్న అరుణ సలహా నచ్చి అంతా కలసి కారులో బయలుదేరారు.

★★★

తమ వయస్సువారితో పిచ్చాపాటి మాట్లాడుతున్న సమయంలో ఎదురుగా కొడుకు, కోడలు, మనవలు వచ్చి నిలబడేసరికి ఆశ్చర్యపోయారు ఆనందరావు దంపతులు.

తమని అందరూ చూస్తున్నారన్న స్పృహ కూడా లేకుండా "ఏం పనిది నాన్నా...మామీద అలిగి వచ్చేయడం ఏం బాగాలేదు. మావలన తప్పు లుంటే చెంపలు వాయించి బుద్ధి చెప్పే హక్కు మీకుంది. అంతేకానీ ఇలా మా నుండి దూరంగా పారిపోతే భరించలేం. దయచేసి మా తప్పులు క్షమించి మాతో వచ్చేయండి" అన్నాడు ప్రాధేయపడుతూ.

అరుణ అత్తగారిని చుట్టుకుపోయింది.

"సారీ అత్తయ్యా... మిమ్మల్ని బాధపెట్టి చాలా తప్పు చేసాను. ఇంకెప్పుడూ మిమ్మల్ని కష్టపెట్టను. నా మూర్ఖత్వాన్ని క్షమించి మనింటికి వెళ్దాం పదండి" అంది ఏడుపుగొంతుతో.

"ఈరోజు నా పుట్టినరోజు. మీరు నా మాట కాదనక నన్ను సంతోష పెడతారనే ఆశిస్తున్నాను" అన్నాడు సురేష్ తండ్రిని లేవనెత్తుతూ.

పౌరుషం, పట్టుదల కలిగి వారికి దూరమయ్యారుగానీ వారిని చూడగానే నిప్పు తగిలిని వెన్నలా వారి మనసులు కరిగిపోయాయి. సరైన ఆలనా పాలనా లేక చిక్కిపోయిన మనవల మీద ప్రేమ పొంగుకొచ్చింది.

"కొన్నాళ్లు మార్పు కోసమని ఇక్కడకు వచ్చాం. మిమ్మల్ని వదిలి మేము మాత్రం ఉండగలమా?" అంటూ తను కొత్తగా కొనుక్కున్న చేతి కర్రని ఊతంగా చేసుకుని నడవబోతున్న అతడి చేతిలోని ఆ కర్రను లాక్కొని దూరంగా పారేసాడు సురేష్.

"నాన్నా... నేను ఆ రోజు మీకు ఆసరాగా ఉంటానన్న మాటకు అర్థం ఇది" అంటూ తండ్రి చేతిని తన భుజంమీద వేసుకున్నాడు.

వారిలోని మార్పుకి ఆ దంపతుల మనస్సు పులకించింది.

అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని బయలుదేరిన వారి కారు ఎటువంటి కుదుపులు లేకుండా సాఫీగా నల్లేరు మీద పరుగులా ముందుకు సాగిపోయింది.

★

## రాబిన్‌హుడ్ చరిత్ర

700 ఏళ్ళుగా 'రాబిన్ హుడ్' గురించి అనేక కథలు, సినిమాలు వచ్చాయి. అయితే, నిజంగా అతను ఉన్నాడా? 'లాక్స్‌లీ'లో రాబిన్‌హుడ్ 1160లో పుట్టినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. మాటిల్డాని పెళ్ళాడిన రాబిన్‌హుడ్ ఆనాటి రాజుగారి సేనతో అనేక యుద్ధాలు చేసాడు. రాజు ఖజానాని అనేకసార్లు దోచి ఆ డబ్బుని పేదవాళ్ళకి పంచి పెట్టాడు. దేశద్రోహిగా రాజు అతన్ని పరిగణించినా అతనేనాడూ పట్టుబడలేదు. 18-11-1247న అతను మరణించినట్టు చరిత్ర చెబుతోంది.

## కన్నతల్లి ప్రేమ

అంగవైకల్యంతో పుట్టిన కూతుర్ని వద్దన్నాడు తండ్రి. ఆ కూతుర్ని వదలుకుంటేనే కాని తనతో సంసారం చేయనన్నాడు ఆ మగమహారాజు. మమతానురాగాలు, మానవత చూపని ఆ మనిషికంటే నవమాసాలు మోసిన కన్నకూతురే మిన్న అనుకుంది ఆ కన్నతల్లి మంచిర్యాలకి చెందిన పల్లవి కుమారి. మరో ఆధారంలేక కూతురి పోషణకోసం స్థానిక హోటల్లో చాకిరీ చేసుకుంటూ శ్రమపడుతోంది ఆమె.

-తటవర్తి

